# కావ్య దళం దాష్టీకం

టీడీపీ అధినేత చంద్రబాబు నుంచి టీడీపీ కావలి అభ్యర్థి కావ్య వరకు ఓటమి కళ్ల ముందు కనిపిస్తోంది. ఎన్నికల క్షేత్రంలో ప్రజాభిమానాన్ని చూరగొనలేక వలంటీర్లకు భయపడి తమ వికృత రూపాన్ని బయట పెట్టుకుంటున్నారు. చంద్రబాబు ఇప్పటికే వలంటీర్లను నిరోధించేందుకు ఏకంగా ఎన్నికల కమిషన్‌పై ఒత్తిడి తెచ్చి వారి సేవలను నిలుపుదల చేయించారు. తన పార్టీ శ్రేణులే కాకుండా.. మిత్రపక్షాలు సైతం మద్దతు లేకపోవడంతో ఫ్రస్టేషన్‌లో ఉన్న కావలి అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి పిచ్చుకపై బ్రహ్మాస్త్రంలా వలంటీర్లపై తన దాష్టీకాన్ని చూపిస్తున్నారు. వలంటీర్లు తమ సొంత పనుల్లో ఉన్నా.. ఫొటోలు తీసి అధికారులకు ఫిర్యాదు చేస్తూ తమ ఆత్మాభిమానాన్ని దెబ్బతీస్తూ, మానసికంగా వేధిస్తున్నారంటూ వలంటీర్లు మూకుమ్మడి రాజీనామాలకు సిద్ధపడ్డారు.

- వలంటీర్లకు వేధింపులు
- సొంత పనుల్లో ఉన్నా.. ఫొటోలు తీస్తూ తప్పుడు ఫిర్యాదులు
- మానసిక వేదనతో మూకుమ్మడిగా రాజీనామాలు
- ఛీదరించుకున్న సొంత పార్టీ నేతలు



రాజీనామాలు చేసి బయటకు వచ్చిన కావలి పట్టణం 10వ వార్డు వలంటీర్లు

కావలి: కావలి నియోజకవర్గంలో వలంటీర్లపై కావ్య దళం వేధింపులు తారా స్థాయికి చేరాయి. ఎన్నికల కోడ్ పేరుతో వలంటీర్లు ఎక్కడ కనిపించినా ఫొటోలు తీసి వేధిస్తుండడంతో నియోజకవర్గంలోని వలంటీర్లు మూకుమ్మడి రాజీనామాలకు సిద్ధమయ్యారు. వలంటీర్ల కదలికలపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచేందుకు కావ్య కృష్ణారెడ్డి తన క్వారీల్లో పనిచేసే గుమాస్తాలు, కిరాయి వ్యక్తులు, గుర్తింపు లేని మీడియా విలేకరులతో ఒక ముఠాను ఏర్పాటు చేశాడు. వలంటీర్లు తమ బంధువుల ఇళ్లకు వెళ్లినా..ఎవరితో మాట్లాడినా ఫొటోలు తీసి, గుర్తింపు లేని మీడియాల్లో వార్తలు రాయించి, వాట్సాప్ గ్రూపుల్లో వైరల్ చేయిస్తున్నారు. కోడ్ పేరుతో వ్యక్తిత్వ హననానికి పాల్పడుతుండడంతో విసిగిపోయిన వలంటీర్లు మూకుమ్మడి రాజీనామాలకు సిద్ధమయ్యారు. సోమవారం ఒక్క రోజే సుమారు 170 మంది వలంటీర్లు రాజీనామాలు చేశారు. కావలి పట్టణంలోని 10 వార్డులో 13 మంది, 16 వార్డులో 20 మంది వలంటీర్లు ఉంటే అందరూ రాజీనామా చేశారు. మిగతా వార్డుల్లో సైతం మరికొంత మంది రాజీనామాలు అందజేసినట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. ఈ వ్యవహారం సోమవారం కావలిలో కలకలం సృష్టించింది.

**వలంటీర్లకు భయపడుతూ..**

40 ఏళ్ల రాజకీయ అనుభవం.. 14 ఏళ్లు ముఖ్యమంత్రి అని చెప్పుకునే టీడీపీ అధినేత చంద్రబాబు అండ్ కో క్షేత్ర స్థాయిలో ప్రజాభిమానాన్ని కోల్పోయి.. చివరికి ప్రజాసేవకులుగా గుర్తింపు తెచ్చుకున్న వలంటీర్లను చూసి భయపడుతున్నాడు. టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీలు పేదల రక్తం తాగితే, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వలంటీర్లు అసలైన సేవకుల్లా మారారు. దీంతో వలంటీర్ల వ్యవస్థపై పగబట్టిన చంద్రబాబు వలంటీర్ల స్థైర్యాన్ని దెబ్బతీసేలా తన నేతలతో ఆరోపణలు చేయించాడు. తాజాగా ఎన్నికల నేపథ్యంలో వలంటీర్లు పింఛన్లు పంపిణీ చేయకుండా ఆంక్షలు విధించేలా ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశాడు. ఎన్నికల కమిషన్ ఉత్తర్వుల మేరకు ప్రభుత్వం కూడా ఎన్నికల కోడ్ పూర్తయ్యే వరకు వలంటీర్లు తమ విధులకు దూరంగా ఉండాలని ఆదేశాలు జారీ చేసింది. అయినా కూడా చంద్రబాబు, టీడీపీ నాయకులు వలంటీర్లపై వేధింపులు ఆపలేదు. 'ఆవు చేలో మేస్తే.. దూడ గట్టున మేస్తుందా' అనే చందంగా కావలి టీడీపీ అభ్యర్థి తన ప్రైవేట్ దళంతో వలంటీర్ల ప్రతి అడుగుపై నిఘా పెట్టి ఫొటోలు తీసి, వేధింపులకు గురి చేస్తున్నాడు. టీడీపీ అధినేత చంద్రబాబు, కావలి అభ్యర్థి కావ్య చర్యలను సొంత పార్టీ శ్రేణులే కాకుండా.. మిత్ర పక్ష పార్టీలు సైతం ఛీదరించుకుంటున్నాయి. వలంటీర్లకు భయపడే వాళ్లు ఎన్నికల్లో పోటీ చేస్తున్నారంటూ సెటైర్లు వేస్తున్నారు. వలంటీర్లకు ప్రజల్లో మంచి పేరు ఉందని, వాళ్లను వేధించడం ద్వారా ప్రజలు తమ మొహం మీదే విమర్శిస్తున్నారని టీడీపీ నేతలే వాపోతున్నారు.

**సేవకు ప్రతి రూపం.. వలంటీర్**

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పేదలకు చేరువ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రామ, వార్డు వలంటీర్ల వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చింది. ప్రతి 50 కుటుంబాలకు ఒక వలంటీర్‌ను నియమించింది. లబ్ధిదారుల ఇంటి వద్దనే పౌరసేవలు అందించే దిశగా ఏర్పాటు చేసిన వలంటీర్ల వ్యవస్థ పాలనలో పెను మార్పులకు శ్రీకారం చుట్టింది. క్షేత్ర స్థాయిలో లబ్ధిదారులను గుర్తించి పథకాల కోసం దరఖాస్తు చేయించడం, 72 గంటల్లోగా పథకాలను పేదల ఇళ్ల వద్దనే అందించడంతో పౌర సేవల్లో పారదర్శకత, వేగం పెరిగాయి.

- కరోనా సమయంలో ఫ్రంట్‌లైన్ వారియర్స్‌తో సమానంగా వలంటీర్లు అందించిన సేవలు దేశ వ్యాప్తంగా ప్రశంసలు అందుకున్నాయి. కరోనా బాధితులను గుర్తించడం, చికిత్స అందించే ఏర్పాట్లు చేయడం, ఐసోలేషన్‌లో ఉన్న కుటుంబాలు పూర్తిగా కోలుకునే వరకు ఇంటి వద్దనే నిత్యావసర వస్తువులు, మందులు అందించడం, కంటైన్‌మెంట్ జోన్లలో శానిటైజేషన్ చేయించడంలో వలంటీర్లు ప్రాణాలకు తెగించి విధులు నిర్వహించారు.
- ప్రతినెలా ఒకటో తేదీనే పొద్దుపొడవక ముందే లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్లు అందిస్తూ వలంటీర్లు సేవాసారథులుగా నిలిచారు. పండుటాకులు, దివ్యాంగులు పంచాయతీ కార్యాలయాల వద్దకు వెళ్లి పడిగాపులు పడాల్సిన అవసరం లేకుండా, వేకువనే చిరునవ్వుతో పింఛన్ చేతిలో పెడుతున్న వలంటీర్లు వృద్ధులకు ఆత్మబంధువుల్లా నిలిచారు.



రాజీనామాలు చేసిన 16వ వార్డు వలంటీర్లు

### చంద్రబాబు ప్రజల గురించి ఆలోచిస్తే.. ఇలా చేయడు



చంద్రబాబు ప్రజలకు మేలు చేయాలి, వారి బాగోగులు చూడాలని ఏనాడు అనుకోలేదు. ప్రజల గురించి ఆలోచన చేసి ఉంటే.. ఇలా చేయడు. పింఛన్లు వలంటీర్లతో పంపిణీ చేయించనివ్వవద్దని అభ్యంతరాలు చెబుతూ చంద్రబాబు నేతృత్వాన పిటిషన్ వేశాడు. పింఛన్ ఆగడానికి చంద్రబాబు కారణం అని లబ్ధిదారులందరికీ తెలిస్తే టీడీపీ కార్యకర్తలను వెంటబెట్టి కొడతారు. 14 ఏళ్లు సీఎంగా చేసిన వ్యక్తి స్థాయికి వలంటీర్లపై బ్రహ్మాస్త్రం సంధించడం చూస్తే.. ఆయన ఏ స్థాయికి దిగజారిపోయాడో అర్థమవుతోంది. కావలిలో టీడీపీ అభ్యర్థి కావ్యను జనమే కాదు.. సొంత పార్టీ అభిమానులు సైతం ఓటుతో బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారు. వలంటీర్లకు భయపడుతున్నారంటే ముందుగానే ఓటమిని అంగీకరిస్తున్నారని అర్థమవుతోంది.

– రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే, కావలి

## క్లుప్తంగా

### ఎమ్మెల్యే మేకపాటి పరామర్శ



రమణమ్మ భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

చేజర్ల: వైఎస్సార్‌సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ పోలంరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి కుటుంబాన్ని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి సోమవారం పరామర్శించారు. ఆయన తల్లి పోలంరెడ్డి రమణమ్మ మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి మండలంలోని గాలిపాళెం గ్రామానికి వెళ్లి ఆమె భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

### రత్నం కుటుంబ సభ్యులకు మాజీ ఎంపీ పరామర్శ



రత్నం కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్ రెడ్డి

ఆత్మకూరురూరల్: రత్నం విద్యా సంస్థల వ్యవస్థాపకుడు కేవీ రత్నం కుటుంబ సభ్యులను నెల్లూరులోని వారి నివాసంలో మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. రత్నం చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. రత్నంతో తమకు ఉన్న సాన్నిహిత్యాన్ని కుటుంబ సభ్యులతో పంచుకున్నారు. రత్నం సతీమణి పద్మావతి, కుమారులు కొర్రపాటి వేణుగోపాల్, డాక్టర్ కృష్ణకిషోర్, తదితరులను పరామర్శించారు.

### సచివాలయాల ద్వారా పింఛన్ల పంపిణీ

- జెడ్పీ సీఈఓ కన్నమనాయుడు



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ కన్నమనాయుడు

ఉదయగిరి: సార్వత్రిక ఎన్నికల నిర్వహణను దృష్టిలో ఉంచుకుని ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బుధవారం నుంచి గ్రామ సచివాలయ సిబ్బందితో సచివాలయాల్లో పింఛన్ల పంపిణీ చేసేలా సంబంధిత అధికారులు ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలని జెడ్పీ సీఈఓ కె.కన్నమనాయుడు తెలిపారు. ఆయన సోమవారం ఉదయగిరిలోని ఎంపీడీఓ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఉత్తర్వుల మేరకు వలంటీర్ల ద్వారా పింఛన్ల పంపిణీ ప్రక్రియ నిలిపివేసిందన్నారు. సంబంధిత అధికారులు వలంటీర్ల వద్ద ఉన్న సెల్‌ఫోన్, సిమ్ కార్డులు వెంటనే స్వాధీనం చేసుకోవాలన్నారు.

### ఎమ్మెల్యేను కలిసిన లీగల్ సెల్ నాయకులు



క్యాంప్ కార్యాలయంలో లీగల్ సెల్ నాయకులతో ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరు: మేకపాటి విక్రమ్‌రెడ్డిని నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ నాయకులు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలిసిన వారితో ఎమ్మెల్యే పలు అంశాలపై చర్చించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గతంలో ఏ ప్రభుత్వంలో లేనివిధంగా జూనియర్ న్యాయవాదులను సైతం ఆదుకునేలా 'వైఎస్సార్ లా నేస్తం' ఏర్పాటు చేసి వారిని ప్రోత్సహించారన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సారథ్యంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వచ్చేలా సమష్టిగా కృషి చేయాలని వారిని కోరారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు షేక్ నజీర్, వెంకటరమణమ్మ, తిరుపతమ్మ, చిన్నారెడ్డి, మల్లికార్జున, నరసింహ, ఎంపీపీ వేణుగోపాల్ రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, నోటి వినయ్‌కుమార్ రెడ్డి, షేక్ రిజ్వాన్ పాల్గొన్నారు.

### పండగలు సర్వమత సామరస్యానికి ప్రతీకలు

- ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి



అనుమసముద్రంపేట: మన పండుగలు సర్వమత సామరస్యానికి ప్రతీకలుగా నిలుస్తాయని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. సోమవారం రాత్రి ఏఎస్‌పేట హజరత్ ఖాజానాయబ్‌రసూల్ దర్గాలో హజరత్ ఖాజానాయబ్‌రసూల్, దొరసానమ్మ సమాధులకు పూలచద్దర్‌ను కప్పి, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ముస్లింలతో కలిసి దువాలో పాల్గొన్నారు. అనంతరం మైనార్టీలతో కలిసి ఇఫ్తార్ విందును స్వీకరించారు. మండల కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ సంధాని, ఉప సర్పంచ్ షేరాజ్, ఉప పీఠాధిపతి జునైద్ పాషా, రమేష్‌రెడ్డి, ఖాదర్, హుమయున్, మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## వర్గ విభేదాలు లేకుండా సమష్టిగా పని చేయండి

- మేకపాటి అభినవ్‌రెడ్డి




అభినవ్‌రెడ్డిని శాలువాతో సత్కరిస్తున్న నాయకులు

జలదంకి : నాయకుల మధ్య వర్గ విభేదాలు ఉంటే పక్కన పెట్టి సమష్టిగా పనిచేసి పార్టీని గెలిపించుకుంటేనే మనందరం సంతోషంగా ఉంటామని మేకపాటి అభినవ్‌రెడ్డి తెలిపారు. నాయకులకు ఏదైనా సమస్య ఉంటే ఎన్నికల తర్వాత అన్ని పరిష్కరించుకుందామని కోరారు. అందరి సమస్యలు తీర్చే బాధ్యతను తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. సోమవారం ఆయన జలదంకి, గట్టుపల్లి, గోపన్నపాళెం, కేశవరం, చినక్రాక, కోదండరామపురం గ్రామాల్లో పర్యటించి నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. గ్రామాల్లో సమస్యలను తెలుసుకున్నారు. అభినవ్‌రెడ్డి మాట్లాడుతూ కార్యకర్తలకు తాము అందుబాటులో ఉంటామని, వారికి అండగా ఉంటామని తెలిపారు. నాయకులు అభినవ్‌రెడ్డిని శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పాలవల్లి మాలకొండారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ తిప్పారెడ్డి ఇందిరమ్మ, నాయకులు వంటేరు రామచంద్రారెడ్డి, ఇస్కా మదన్‌మోహన్‌రెడ్డి, రావి ప్రసాద్‌నాయుడు, దేవరపల్లి రఘురామిరెడ్డి, బోడిమండ్ల కృష్ణారెడ్డి, పులి మాల్యాద్రి, ఎడ్ల మాల్యాద్రిరెడ్డి, పులి భాస్కర్, టక్కోలు నారాయణరెడ్డి, వట్టికాల బాలయ్య, గుమ్మలంపాటి సుబ్బారావు, వాకా శ్రీనివాస్‌రెడ్డి, కాకాణి మహదేవ, గుమ్మలంపాటి కళ్యాణ్, మాల్యాద్రి పాల్గొన్నారు.

**పరామర్శ**

అనంతరం గోపన్నపాళెంలో వైఎస్సార్‌సీపీ నేత ఒరుగంటి కృష్ణారెడ్డి మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను అభినవ్‌రెడ్డి పరామర్శించారు. అదే గ్రామంలో సంఘన మాల్యాద్రి ఇటీవల మృతి చెందడంతో అతని కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## మేకపాటి విజయానికి సైనికుల్లా పనిచేస్తాం



రాజగోపాల్‌రెడ్డిని కలిసిన ఏసీ కాలనీ యువత

ఉదయగిరి: ఉదయగిరి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి విజయానికి సైనికుల్లా పని చేస్తామని దుత్తలూరు ఏసీ కాలనీవాసులు తెలిపారు. ఏసీ కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు గొల్లపల్లి గిరి, గొల్లపల్లి వెంకటేష్ ఆధ్వర్యంలో సోమవారం దుత్తలూరు క్యాంపు కార్యాలయంలో మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, మేకపాటి అభినవ్‌రెడ్డిలను ఏసీ కాలనీ వాసులు మర్యాద పూర్వకంగా కలిశారు. వారు మాట్లాడుతూ మేకపాటి కుటుంబం వల్లే నియోజకవర్గం అభివృద్ధి జరిగిందని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలతో పేదరికం తగ్గిందన్నారు. రానున్న ఎన్నికల్లో ఎంపీగా విజయసాయిరెడ్డిని, ఎమ్మెల్యేగా మేకపాటి రాజగోపాల్‌రెడ్డిని గెలిపించుకునేందుకు తమవంతు కృషి చేస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు దొంతిరెడ్డి వాసుదేవ రెడ్డి, నాయకులు వెంకటరెడ్డి, బేబి సురేఖ, అన్నంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, రంగయ్యనాయుడు పాల్గొన్నారు.

## జగనన్నతోనే అన్ని వర్గాల సంక్షేమం

- ఎమ్మెల్యే అభ్యర్థి రాజగోపాల్‌రెడ్డి



ఇస్కదామెర్లలో ప్రజలకు అభివాదం చేస్తున్న రాజగోపాల్‌రెడ్డి

కొండాపురం: అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన సాగించిన జగనన్నను మరోమారు ఆశీర్వదించాలని ఉదయగిరి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ప్రజలను కోరారు. సోమవారం మండలంలోని ఇస్కదామెర్ల, వెలిగండ్ల పంచాయతీల్లో విజయ సంకల్ప యాత్ర నిర్వహించారు. గ్రామాల్లో స్థానిక నాయకులు, కార్యకర్తలు, ప్రజలు రాజగోపాల్‌రెడ్డికి భారీ బైక్ ర్యాలీలు, పూలమాలలతో ఘన స్వాగతం పలికారు. రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా వైఎస్ జగన్ 99 శాతం హామీలు అమలు చేసి రికార్డు సృష్టించారన్నారు. సంక్షేమ పథకాల ద్వారా ప్రతి ఇంటికి రూ. 5 లక్షల వరకు లబ్ధి చేకూరిందన్నారు. మరోసారి కూటమి పేరుతో టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు ప్రజలను మోసగించడానికి వస్తున్నాయని, కూటమి నాయకులు మాటలు నమ్మి మోసపోవద్దని కోరారు. చంద్రబాబు చేసిన కుట్రలతోనే వలంటీర్ల సేవలను ఎన్నికల కమిషన్ నిలిపివేసిందన్నారు. పేదల తలరాత మార్చాలన్నదే సీఎం జగన్ లక్ష్యమని, రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం స్థిరంగా కొనసాగాలంటే రాబోవు ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా విజయసాయిరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఉదయగిరి సమగ్రాభివృద్ధికి తాను శాయశక్తులా కృషి చేస్తానన్నారు. కార్యకర్తలు, నాయకులకు అండగా ఉంటానని చెప్పారు. వెలిగండ్ల పంచాయతీలో టీడీపీకి చెందిన 15 కుటుంబాలువైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి రాజగోపాల్‌రెడ్డి పార్టీ కుండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీ మండల అధ్యక్షుడు చిమ్మిలి రవీంద్ర, గుడవళ్లూరు సొసైటీ అధ్యక్షుడు కర్తం శ్రీనివాసులరెడ్డి, సర్పంచ్ ఇరగల శేఖర్‌రెడ్డి, నాయకులు ఇరగల భాస్కర్‌రెడ్డి, ఇరగల నారాయణ రెడ్డి, బొడ్డు మాధవ, మోహన్, పి. కమలాకర్, జేసీఎస్ కన్వీనర్ యారం నరసింహారావు, ఎడ్లపల్లి వెంకటరమణయ్య, మన్నం వెంకటసుబ్బయ్య, ఎరజాల మాల్యాద్రి, ఎం. మురళీ, అరవా మాలకొండయ్య, అరవా సుబ్బయ్య, వెలిగండ్ల సర్పంచ్ చిన్నక్క, రమేష్, పెనుబాకల రవీంద్రరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఇంటింటి ప్రచారం

సీతారామపురం(ఉదయగిరి): మండలంలోని బాలాయపల్లి సచివాలయ పరిధిలో ఉన్న పోకలవారిపల్లి, అంకిరెడ్డిపల్లి, రంగనాయుడుపల్లి ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో సోమవారం పార్టీ మండల ఉపాధ్యక్షుడు బసిరెడ్డి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో 'జగనన్న భరోసా, రాజన్న గ్యారెంటీ' పేరుతో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న నవరత్నాలు, సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలవాలని కోరారు. గత టీడీపీ ప్రభుత్వం, ఈ ప్రభుత్వానికి మధ్య తేడాను వివరించారు. ఈ కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ బాలినేని మాబయ్య, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు బసిరెడ్డి రమాదేవి, బొడ్డు రామచంద్రయ్య, సీహెచ్ రమణయ్య, పిడతల జాన్సన్, బి.శ్రీనివాసులురెడ్డి, జంగం ప్రసాద్, సీహెచ్ రమణయ్య, జయరాజు, మొగల్ అబ్దుల్ పఠాన్ ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

### ఉత్తమ ఫలితాలతో ఉజ్వల భవిష్యత్

- ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి



ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డిని సన్మానిస్తున్న పాఠశాల యాజమాన్యం

ఆత్మకూరు: విద్యార్థులు పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి తద్వారా ఉజ్వల భవిష్యత్‌ను ఏర్పరుచుకోవాలని ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రగతి ఇంగ్లిష్ మీడియం పాఠశాల 12వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం రాత్రి నిర్వహించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ తల్లిదండ్రులు ఎంతో కష్టపడి సంపాదించిన సొమ్మును పిల్లల చదువుల కోసం వినియోగిస్తారని, వారి ఆశలు నెరవేరేలా విద్యార్థులు మెలగాలని సూచించారు. ప్రతి ఏటా ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న ప్రగతి పాఠశాల నిర్వాహకులు ఎస్.రామ్మోహన్‌రెడ్డి దంపతులను అభినందించారు. ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డిని పాఠశాల యాజమాన్యంతో పాటు అపస్మా రాష్ట్ర సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నేతాజీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అనంతరం పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అపస్మా రాష్ట్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు సీహెచ్ రమణారెడ్డి, ఎస్ శ్రీధర్, ఈగా భాస్కర్‌రెడ్డి, జి ప్రభాకర్, సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కంచి పరమేశ్వర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### గురుకులంలో ప్రవేశాలకు గడువు పొడిగింపు

ఆత్మకూరు: జిల్లాలోని ప్రభుత్వ గురుకుల సొసైటీ పరిధిలోని అన్ని గురుకుల పాఠశాలల్లో 5వ తరగతి ప్రవేశాల కోసం గడువును ఏప్రిల్ 5వ తేదీ వరకు పొడిగించినట్లు ఆత్మకూరు గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపల్ టి కామేశ్వరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆత్మకూరు, తుమ్మలపెంట బాలికల పాఠశాలలు, గండిపాళెం బాలుర గురుకుల పాఠశాలల్లో ప్రవేశాల కోసం ఈ నెల 25వ తేదీన జిల్లా కేంద్రాల్లో ప్రవేశ పరీక్షలు జరుగుతాయన్నారు.

ఉదయగిరి: ఏపీ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులకు గడువును ఈ నెల 5వ తేదీ వరకు పొడిగించినట్లు జిల్లా గురుకుల విద్యాలయాల కన్వీనర్ జి.మురళీకృష్ణ తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికి 5వ తరగతి 6,7,8 తరగతుల్లో మిగిలి ఉన్న ఖాళీలు, ఇంటర్, డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు అర్హులైన ఆసక్తి కలిగిన అభ్యర్థులు సూచించిన వెబ్‌సైట్‌లో దరఖాస్తులు దాఖలు చేసుకోవాలన్నారు.

### ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం నేడు

బిట్రగుంట: బోగోలు మండలంలో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మద్దిబోయిన వీరరఘు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ఎస్‌జీవీ కండ్రిగ, 11 గంటలకు బీజీవీ కండ్రిగ, 12 గంటలకు సోమేశ్వరపురం, మధ్యాహ్నం ఒంటి గంటలకు జక్కేపల్లి గూడూరు, 2 గంటలకు ఏబీ కండ్రిగలో ప్రచారం నిర్వహిస్తారన్నారు. సాయంత్రం నాలుగు గంటలకు నాగులవరం, ఆరు గంటలకు తాళ్లూరులో ప్రచారం నిర్వహిస్తారని వివరించారు.

### నేడు విజయసాయిరెడ్డి పర్యటన

ఆత్మకూరు: నెల్లూరు ఎంపీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి మంగళవారం ఆత్మకూరులో పర్యటించనున్నారని ఎమ్మెల్యే కార్యాలయ ప్రతినిధులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని సంగం నుంచి ఉదయం 9 గంటలకు బైక్ ర్యాలీ ద్వారా ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డితో కలిసి విజయసాయిరెడ్డి ఆత్మకూరుకు రానున్నట్లు తెలిపారు. పది గంటలకు శ్రీధర్ గార్డెన్స్‌లో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలతో కలిసి సమావేశం నిర్వహించనున్నట్లు వివరించారు. పార్టీ బాధ్యులు, అభిమానులు, నాయకులు తప్పనిసరిగా పాల్గొనాలని కోరారు.

### వైఎస్సార్‌సీపీలో చేరిక



భరత్‌రెడ్డికి కండువా వేసి ఆహ్వానిస్తున్న విజయసాయిరెడ్డి, బీద మస్తాన్‌రావు

కావలి: మండలంలోని ఆనెమడుగు గ్రామానికి చెందిన లింగారెడ్డి భరత్‌రెడ్డి సోమవారం తన అనుచరులతో కలిసి నెల్లూరు వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. నెల్లూరు రామ్మూర్తినగర్‌లోని విజయసాయిరెడ్డి క్యాంప్ కార్యాలయంలో ఎంపీ బీద మస్తాన్‌రావుతో కలిసి భరత్‌రెడ్డికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

### నేడు మేకపాటి విజయ సంకల్ప యాత్ర

కొండాపురం: మండలంలోని గానుగపెంట, శెట్టిపాళెం పంచాయతీల్లో మంగళవారం ఉదయగిరి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి విజయ సంకల్ప యాత్ర నిర్వహిస్తారని పార్టీ మండల అధ్యక్షుడు చిమ్మిలి రవీంద్ర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు జయప్రదం చేయాలని కోరారు.

## చంద్రబాబు ఎజెండా దోచుకోవడమే

- ప్రజలకు మంచి చేయడమే జగన్ లక్ష్యం
- వలంటీర్ల వ్యవస్థపైనా చంద్రబాబు కక్ష
- ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డిని పూలవర్షంతో గ్రామంలోకి ఆహ్వానిస్తున్న మహిళలు

కావలి: అధికారంలో ఉన్న 14 ఏళ్లు తనకు సంబంధించిన పెత్తందార్లకు దోచి పెట్టడమనే లక్ష్యంగా చంద్రబాబు ఎజెండాకు పెట్టుకుంటే.. కేవలం ఐదేళ్లు మాత్రమే పరిపాలించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజలకు ప్రభుత్వం ఎన్ని రకాలుగా మేలు చేయవచ్చో అన్ని రకాలుగా మేలు చేయడమే లక్ష్యంగా పెట్టుకొని పరిపాలన చేశారని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలం ఆముదాలదిన్నె, తాళ్లపాళెం పంచాయతీల్లో సోమవారం ఎమ్మెల్యే ఎన్నిక ప్రచారాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్ జగన్ ప్రభుత్వం రాక ముందు చంద్రబాబు పాలనలో నాలుగు సంవత్సరాల పది నెలలు పింఛన్ ఎంత ఇచ్చాడో ప్రతి అవ్వ, తాత, వితంతు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు ఆలోచించాలన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాను అధికారంలోకి వస్తే రూ.2 వేల ఇస్తానని చెప్పగానే ఎన్నికలకు నెల ముందు చంద్రబాబు రెండు వేలు పెంచాడని గుర్తు చేశారు. ఇదీ చాలదని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక రూ.3 వేలకు పెంచారని చెప్పారు. వలంటీర్ల వ్యవస్థపైనా చంద్రబాబు కక్ష పూరితంగా వ్యవహరిస్తున్నారని, వారితో పింఛన్లు పంపిణీ చేయకుండా అడ్డుకున్నారని ఎమ్మెల్యే మండిపడ్డారు. దీంతో పింఛన్‌దారులు మూడు నెలల పాటు నరకయాతన అనుభవించాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. చంద్రబాబు అధికారంలో ఉన్నా.. లేకుండా సామాన్య ప్రజలను వేధించుకోవడమే లక్ష్యంగా ఉన్నాడని మండిపడ్డారు. ఈ రోజు ఎక్కడికి వెళ్లినా.. ఎవరికి అడిగినా ఎంత గౌరవంగా పథకాలు అందుతున్నాయని, మాకు ఇంత వచ్చిందంటే.. మాకు ఇంత వచ్చిందని సంతోషంగా, గర్వంగా చెబుతున్నారన్నారు. 14 ఏళ్ల చంద్రబాబు పాలనలో ఉమ్మడి రాష్ట్రం, విభజన రాష్ట్రంలో అన్ని రంగాలను నాశనం చేశాడని, అప్పట్లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి, ఇప్పుడు ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దేశానికి ఆదర్శనీయమైన పాలన అందించారన్నారు. ప్రజలందరూ చంద్రబాబు పాలనకు, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు తేడాలను గమనిస్తున్నారని, రానున్న ఎన్నికల్లో ఓటమి తప్పదని గ్రహించి చంద్రబాబు నీచ రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. మీ గ్రామాల్లో కొత్తగా కనిపిస్తున్న అభివృద్ధి, మీ కుటుంబాల్లో సంక్షేమ పథకాలతో వచ్చిన అభివృద్ధిని గమనించి మీకు మేలు జరిగిందని భావిస్తే మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసుకోవాలని కోరారు. ఈ ఎన్నికల్లో ఓటు వేసేది కేవలం ఓ ఎమ్మెల్యేనో, ఎంపీనో ఎన్నుకునే దాని కోసం కాదని, జరుగుతున్న ఈ మార్పులు కొనసాగడం కోసం వైఎస్ జగన్ కోసం ఓటు వేయాలని, మార్పులు కొనసాగితేనే పేదల తలరాతలు మారుతాయని, పేద వాడి బతుకులు కూడా మారుతాయని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. ఏఎంసీ చైర్మన్ సన్నిబోయిన ప్రసాద్‌యాదవ్, జెడ్పీటీసీ జంపాని రాఘవులు ఎంపీపీ కొండమ్మ, నాయకులు కాటా శ్రీనివాసులురెడ్డి, ఉడా బ్రహ్మానందం, కందుల శ్రీనివాసులు, ఖలీల్ పాల్గొన్నారు.

**పండగ వాతావరణంలో సాగిన ప్రచారం**

ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి సోమవారం ఆముదాలదిన్నెలో పర్యటించారు. ప్రచారాన్ని పండగ వాతావరణంలో చేసేలా స్థానికులు పొలం పనులు కూడా వాయిదా వేసుకుని పొలిమేరల నుంచే పూలవర్షంతో ఘన స్వాగతం పలికారు. మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికి గుమ్మడి కాయలతో దిష్టి తీశారు.

## వైఎస్సార్‌సీపీలో 130 టీడీపీ కుటుంబాల చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ కుటుంబాలతో ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: పట్టణంలోని ముసునూరుకు చెందిన 130 టీడీపీ కుటుంబాలు సోమవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. స్థానిక ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి నివాసానికి వచ్చిన వారందరికీ ఆయన పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ముసునూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ నేత, శ్రీశైలం దేవస్థానం పాలక మండలి ప్రత్యేక ఆహ్వానితులు కేతిరెడ్డి జగదీశ్వరెడ్డి ఆధ్వర్యంలో వడ్డిపాళెం నుంచి వెల్లపు శీనయ్య, ప్రసాద్, హరి ఆధ్వర్యంలో 50 కుటుంబాలు, మాజీ కౌన్సిలర్ మందా శ్రీనివాసులు, మందా తిరుపాలు, కత్తి రత్నం ఆధ్వర్యంలో ఎస్సీ కాలనీ నుంచి 50 కుటుంబాలు, ఇతర సామాజిక వర్గాలకు చెందిన 30 కుటుంబాలు బ్రహ్మయ్య, శ్రావణ్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ ఇప్పుడిప్పుడు కావలి అన్ని రకాలుగా బాగుపడుతోందని, ఇంకా అభివృద్ధి చెందాలంటే అందరికీ ఆత్మీయుడైన ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డిని గెలిపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కావలి పట్టణ పార్టీ అధ్యక్షుడు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, పార్టీ నాయకులు మహేష్, రవికుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కుంభాభిషేక మహోత్సవం ప్రారంభం



కుంభాభిషేక కలిశ పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: పట్టణంలోని జేఆర్‌పేటలో కొలువైన పద్మావతి, గోదాదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో మహాసంప్రోక్షణ, కుంభాభిషేక పూజలు సోమవారం రాత్రి ప్రారంభమయ్యాయి. టీటీడీ ఆస్థాన అర్చకులు తొలుత విశ్వక్సేన పూజ, కలిశ స్థాపన కార్యక్రమాలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మాజీ జెడ్పీ చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్ర రెడ్డి ఆధ్వర్యంలో వైభవంగా పూజలు నిర్వహిస్తున్నారు. వెంకటేశ్వరస్వామి మూలవిరాట్ ఎదురుగా ఆస్థాన మండపంలో పూజలు నిర్వహించారు. రుత్విగ్వరణం, మేధిని పూజ, అష్టబంధనం, తదితర పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంతో పాటు ఆలయ సమీపంలో ఏర్పాటు చేసిన పద్మావతి, గోదాదేవి విద్యుత్ దీప కటౌట్‌లు, దశావతారాల విద్యుత్‌దీపాల కటౌట్‌లు భక్తులను ఆకర్షణగా నిలిచాయి.